RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 302 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 5 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-



# అప్పులు తగ్గినయ్...

## రీపేమెంట్లు భారీగా పెరిగినయ్!

## ఆర్థిక క్రమశిక్షణకు ప్రభుత్వం పెద్దపీట!!

హైదరాబాద్ : గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు వడ్డీ కింద ఇప్పటి వరకు ప్రతి రోజు రూ. 207 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. చేసిన అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏర్పడింది. ఆదాయం ఎంత వచ్చినా చిల్లు పడిన కుండ నిండని తీరుగా రాష్ట్ర ఖజానా ఉంది. ఎంత ఆదాయం పెరిగినా రోజు వారీ ఖర్చులకు సరిపోక కిస్తీలు చెల్లించడానికే కొత్త అప్పులు చేస్తున్నారు. గుడ్డిలో మెల్ల అన్నతీరుగా రేవంత్ రెడ్డి సీఎంగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ, అసలు చెల్లింపుల కంటే తక్కువ అప్పులు చేస్తూ, నిదానంగా తెలంగాణ ప్రజలపై అప్పుల భారం తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లుగా అధికార వర్గాలలో చర్చ జరుగుతోంది. ఈ మేరకు పదేండ్లుగా విధ్వంసమైన ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టిందంటున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు వడ్డీ కింద రూ. 25,911 కోట్లు చెల్లింపులు చేయగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు తరువాత తెచ్చిన అప్పులు రూ. 17,618 కోట్లని చెపుతున్నాయి.

**ఖర్చులపై నియంత్రణ...** గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు చెల్లించేందుకు ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోందని అధికార వర్గాలు చెపుతున్నాయి. దుబారా లేకుండా ప్రతి పైసాకు జవాబుదారీగా ఉండేలా ఖర్చులపై నియంత్రణను అమలు చేస్తోందని అంటున్నారు. గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ. 7 లక్షల కోట్లు అప్పులు చేసింది. వాటికి చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలే తడిసిమోపెడయ్యాయి. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు. అంటే డిసెంబర్ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్, బడ్జెటేతర రుణాలన్నీ కలిపి రూ. 17, 618 కోట్ల అప్పులు చేసిందంటున్నారు. ఈ కాలంలోనే రూ. 25, 911 కోట్లు అప్పులకు సంబంధించిన రీపేమెంట్లు (అసలు, వడ్డీలు కలిపి కిస్తీలు) తిరిగి చెల్లింపులు చేసినట్లు అర్థిక శాఖ అధికార వర్గాలు చెపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగు నెలల్లో తెచ్చిన కొత్త అప్పులు కూడా గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు చెల్లించేందుకు కూడా సరిపోలేదంటున్నారు. గత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు వడ్డీలు కలిపి తిరిగి చెల్లించేందుకు గడిచిన 125 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సగటున ఒక రోజుకు రూ. 207 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది.

**కిస్తీల చెల్లింపులకు మొదటి ప్రాధాన్యత....** గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా చేసిన అప్పులకు వడ్డీలు, కిస్తీలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చినట్లు స్పష్టమవుతోంది. పదేండ్లలో రాష్ట్ర ఖజానాపై మోయలేనంతగా పెరిగిన రుణభారం తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తోందన్న చర్చ అధికార వర్గాలలో జరుగుతోంది. వీటికి తోడుగా ప్రభుత్వం ప్రజోపయోగమైన నిర్మాణాలకు, పనులకు మరో రూ. 5816 కోట్లు మూలధన వ్యయంగా ఖర్చు చేసిందంటున్నారు. గత ప్రభుత్వం చేసినట్లుగా ఇష్టారాజ్యంగా అప్పుల జోలికి వెళ్లకుండా నియంత్రణ పాటించింది. బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకొని ప్రణాళిక ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానం అనుసరించింది.

**తగ్గుతున్న అప్పులు...** గతంతో పోలిస్తే అప్పులు తగ్గుముఖం పట్టడం శుభసూచకమని అధికార వర్గాలు చెపుతున్నాయి.

కొంతమేరకు అప్పులను నియంత్రించటంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించిందంటున్నాయి. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు నాలుగు నెలల్లో రూ. 17,618 కోట్లు ప్రభుత్వం అప్పులు తీసుకుందని చెపుతున్నాయి. గత ప్రభుత్వం 2022-23 సంవత్సరం ఇదే వ్యవధిలో రూ. 19,569 కోట్లు, 2021-22లో రూ. 26,995 కోట్ల అప్పులు తీసుకున్నట్లు చెపుతున్నారు. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో రూ. 59,625 కోట్ల రుణాలను ప్రభుత్వం అంచనా వేయగా, అందులో ఇప్పటివరకు కేవలం రూ. 2500 కోట్లు మాత్రమే అప్పుగా తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెపుతున్నాయి.

**రుణాలు తీసుకునే అవకాశం ఉన్నా..** గతంతో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగినందున రుణాలు తీసుకునే పరిధి పెరిగిందని ఆర్థిక శాఖ అధికారులు చెపుతున్నారు. జీఎస్డీపీ ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం తక్కువ అప్పులు చేయటం కొత్త మార్పునకు సంకేతమని అంటున్నారు. సాధారణంగా ప్రభుత్వాలు తాము చేసే రీపేమెంట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకుంటాయి, కానీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణం కంటే ఎక్కువ కిస్తులు చెల్లించిందన్న చర్చ సచివాలయ వర్గాలలో జరుగుతోంది. తెచ్చిన అప్పుల కంటే తిరిగి చెల్లింపులు చేసింది ఎక్కువగా ఉండటం ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పట్టిందని అంటున్నారు.



# వారి ఓటు వారికే వేసుకోలేరు..

## హైదరాబాద్‌లో ఐదుగురు అభ్యర్థుల వింత పరిస్థితి

హైదరాబాద్ : ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత ముఖ్యమో ఓటు అంతకంటే ముఖ్యం. ఈ హక్కును వినియోగించుకోవడానికి ఎన్నో సంస్థలు చైతన్యం కల్పిస్తుంటాయి. ప్రభుత్వ వ్యవస్థలను తమ చేతుల్లోకి తీసుకుని ఎన్నికల సంఘమూ అత్యంత పటిష్ఠమైన ఏర్పాట్లతో ఓట్ల పండగను నిర్వహిస్తుంటుంది. ఇక పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా ఒక్క ఓటు కూడా చేజారకుండా చూసుకుంటారు. అయితే, తెలంగాణలో ప్రస్తుతం లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఐదుగురు అభ్యర్థులు మాత్రం విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

**అసదుద్దీన్ ఓటు ఇతర పార్టీ అభ్యర్థికే..** ఓటు ఒకచోట.. పోటీ మరోచోట.. ఇదీ హైదరాబాద్ మహా నగర పరిధిలోని ఐదుగురు అభ్యర్థుల పరిస్థితి. వాస్తవానికి ఎక్కడ ఓటు ఉంటే అక్కడే బరిలో దిగాలని ఏమీ లేదు. కాగా, అసలు విషయానికి వస్తే హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఓటు వారి కార్యక్షేత్రం పాత బస్తీలో లేదు. అసద్ భాయ్ రాజేంద్ర నగర్ పరిధిలో నివాసం ఉంటున్నారు. ఇది చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది.

చిత్రమేమంటే.. చేవెళ్లలో ఎంఐఎం అభ్యర్థిని నిలపలేదు. అంటే.. అసదుద్దీన్ ఓటు కచ్చితంగా వినియోగించుకుంటే అది వేరే పార్టీ అభ్యర్థికేనని స్పష్టమవుతోంది. మాధవీ లత ఓటు కంటోన్మెంట్ లో హైదరాబాద్ లో అసదుద్దీన్ ఢీ కొడుతున్న బీజేపీ అభ్యర్థి మాధవీ లత ఈస్ట్ మారేడుపల్లిలోని మహేంద్ర హిల్స్ లో ఉంటున్నారు. ఇది కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం కిందకు వస్తుంది. ఇక ఎంపీ నియోజకవర్గం మాత్రం మల్కాజిగిరి. అంటే.. మాధవీ లత అసెంబ్లీ ఉప ఎన్నికలో కంటోన్మెంట్ కు, లోక్ సభ ఎన్నికలో మల్కాజిగిరి అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ సమీర్ కు ఓటు జూబ్లీహిల్స్ లో ఉంది. ఇది సికింద్రాబాద్ లోక్ సభ స్థానం పరిధికి వస్తుంది. దీంతో సమీర్ తన ఓటును తనకు వేసుకోలేరు. చేవెళ్లలో ఓటు మల్కాజిగిరిలో పోటీ మల్కాజిగిరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పట్నం సునీతా మహేందర్ రెడ్డి ఓటు తాండూరు అసెంబ్లీ పరిధిలో ఉంది. ఇది చేవెళ్ల లోక్ సభ నియోజకర్గం కిందకు వస్తుంది. అంటే.. సునీతా మరో అభ్యర్థికి ఓటు వేయాల్సిందే. మల్కాజిగిరిలో ఓటు.. చేవెళ్లలో పోటీ చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కు ఓటు వచ్చేసి మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో ఉంది. ఇది కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలోకి వస్తుంది. దీంతో కాసానికి వేరొక అభ్యర్థికి ఓటు వేయాలి.



## నేడు తెలంగాణకు రాహుల్ గాంధీ

హైదరాబాద్, మే 4: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు మరో వారం రోజుల సమయమే ఉంది. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రచార జోరును మరింత పెంచింది. కాంగ్రెస్ అధిష్టాన పెద్దలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు తెలంగాణకు రానున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రెండు సార్లు రాష్ట్రంలో రాహుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించేలా కాంగ్రెస్ షెడ్యూల్‌ను రూపొందించింది. రేపు (ఆదివారం) రాహుల్ రాష్ట్రానికి రానున్నారు. రేపు ఉదయం 11 గంటలకు నిర్మల్ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఆలంపూర్ ఎర్రవల్లి చౌరస్తాలో రాహుల్ సభ ఉండనుంది. అలాగే ఎన్నికలకు నాలుగు రోజుల ముందు మరోసారి రాహుల్ తెలంగాణకు రానున్నారు. ఈనెల 9న రాహుల్ మరోసారి తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. 9వ తేదీన సరూర్ నగర్ స్టేడియంలో కాంగ్రెస్ బహిరంగ సభలో రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగిస్తారు.



# కాంగ్రెస్ ప్రత్యేక వ్యూహం

### - తొమ్మిది మంది సహ ఇన్‌చార్జిల నియామకం - ముమ్మరంగా ప్రచారం

కరీంనగర్ : కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గంలో తిరిగి పాగా వేయాలని ప్రత్యేక వ్యూహాలతో ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నది. అభ్యర్థిని ప్రకటించడంలో తీవ్ర జాప్యం కారణంగా జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతున్నది. అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు పేరును ప్రతిపాదించి ఆయనకు టికెట్ ఇప్పించుకోవడంలో సఫలమైన మంత్రి పొన్నం ప్రభాకర్‌పైనే ఆయనను గెలిపించుకునే బాధ్యత పడింది. మాజీ శాసనసభ్యులు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, కటకం మృత్యుంజయం, కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొండూరు గాంధీరావు, కె చక్రధర్‌రెడ్డిని పీసీసీ పార్లమెంట్ నియోజకవర్గ సహ ఇన్‌చార్జిలుగా నియమించి ప్రచార బాధ్యతలను అప్పగించింది.

**చేరికలకు గేట్లు ఎత్తివేత :** మరోవైపు ఇంతకాలం ఇతర పార్టీల వాళ్లను చేర్చుకోవడంలో ఆచితూచీ వ్యవహరిస్తున్న నాయకత్వం ప్రస్తుతం చేరికలకు గేట్లు తెరిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం సిరిసిల్లలో జరిగిన జన జాతర సభలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేటర్లు నేతికుంట యాదయ్య, చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ళ ప్రసాద్, పిట్టల శ్రీనివాస్, గంట కల్యాణి శ్రీనివాస్, ఆకుల నర్మద నర్సయ్యపటేల్. కె భూమాగౌడ్, మెండి శ్రీలత చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ పత్తెం మోహన్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ కాంగ్రెస్‌లో చేరారు. వీరి చేరికకు ముందే కోల భాగ్యలక్ష్మి ప్రశాంత్, కాశెట్టి లావణ్య శ్రీనివాస్, ఆకుల పద్మ ప్రకాశ్, సీనియర్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, వహజొద్దీన్, పార్టీలో చేరారు. ఘర్ వాపసీ నినాదంతో వీరంతా మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కాంగ్రెస్ మేనిఫెస్టోతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించి ప్రజల్లోకి వెళ్తున్నారు. తన సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా గతంలో తాము ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గంలో తిరిగి పాగా వేయాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి.

# గాడిద గుడ్డు ఇచ్చిన భాజపాకు కర్రు కాల్చి వాత పెట్టాలి

## కొత్తకోట కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



కొత్తకోట: గజ్వేల్ నుంచి కేడీ వచ్చినా.. ఢిల్లీ నుంచి మోదీ వచ్చినా పాలమూరులో కాంగ్రెస్‌ను ఓడించలేరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడారు. "అమెరికాలో చదువుకునో, వారసత్వ రాజకీయాలతోనో మీ ముందుకు ముఖ్యమంత్రిగా రాలేదు. నేను చదువుకున్నది వనపర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో. ఆనాడు చిన్నారెడ్డి గెలుపు కోసం గోడలపై రాతలు రాశా. మీ ఆశీర్వాదంతోనే ఈ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టా. మీ బిడ్డ సీఎం అయ్యి 150 రోజులు కాకముందే.. కొందరు దిగిపో అంటున్నారు. ఈ పాలమూరు బిడ్డను సీఎం పదవి నుంచి దించడానికి ఢిల్లీ నుంచి బయలుదేరారు. ఇంకొందరు శత్రువు పంచన చేరి మనల్ని ఓడించాలని చూస్తున్నారు. డీకే అరుణ కాంగ్రెస్‌ను ఓడించాలని చెబుతోంది. కాంగ్రెస్ ఆమెకు ఏం అన్యాయం చేసింది. గద్వాలకు ఎమ్మెల్యేగా చేసినందుకా? ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిని చేసినందుకా? అరుణకు ఇంత పేరు తెచ్చిపెట్టింది కాంగ్రెస్ కాదా? మాదిగల ఏబీసీడీ వర్గీకరణ కోసం ఢిల్లీలో మాట్లాడేవారు ఉండాలంటే వంశీ గెలవాలి. ముదిరాజ్ సోదరులను బీసీ డీ నుంచి ఏగా మార్చేందుకు సుప్రీంకోర్టులో సమస్యలు పరిష్కరించేందుకు, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు వంశీచంద్‌రెడ్డి ఎంపీగా గెలవాలి. హరీశ్‌రావు రాజీనామా పత్రం రెడీగా పెట్టుకో.. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి సిద్దిపేటకు పట్టిన శని వదిలిస్తా. భాజపా తెలంగాణకు ఇచ్చింది.. మోదీ తెచ్చింది ఏమీ లేదు గాడిద గుడ్డు తప్ప. గాడిద గుడ్డు ఇచ్చిన భాజపాకు కర్రు కాల్చి వాత పెట్టాలి. పాలమూరు జిల్లాలో భాజపాని పాతరేయాలి. వంశీని లక్ష మెజార్టీతో గెలిపించాలి" అని రేవంత్‌రెడ్డి కోరారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఎన్నికల వేళ హెలికాప్టర్లకు డిమాండ్ అద్దె ఎంతో తెలుసా?

ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలతోపాటు పార్లమెంటుకు ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హెలికాప్టర్లకు, చాపర్లకు ఎక్కడ లేని డిమాండ్ నెలకొంది. ఆయా పార్టీలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నా, రోజుకు రెండు మూడు సభల్లో పాల్గొనాలన్నా హెలికాప్టర్ల అవసరం ఉంటుంది. హెలికాప్టర్లు అయితే గంటలోపుగానే రాష్ట్రం నలుమూలలకు వెళ్లిపోవచ్చు. దీంతో సమయం పెద్ద ఎత్తున కలిసి వస్తుంది. ఈ నేపథ్యంలో హెలికాప్టర్లకు మాండ పెరిగిపోయింది. అధికార, ప్రతిపక్ష పార్టీ ముఖ్య నేతలతో పాటు మధ్యలో వచ్చే జాతీయ నాయకులతోనూ ప్రచారం హోరెత్తించేందుకు అన్ని పార్టీలూ ఇదే మంత్రాన్ని జపిస్తున్నాయి. ఇలా తక్కువ సమయంలో ఎక్కువ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు అవకాశం ఉన్న ఏకైక సాధనం హెలికాప్టర్. దీంతో వీటికి ఎన్నికల వేళ డిమాండ్ ఏర్పడింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో హెలికాప్టర్లను అద్దెకిచ్చే కంపెనీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం హెలికాప్టర్ కు గంటకు రూ. 1.50 లక్షలు నుంచి రూ. 2 లక్షల వరకు అద్దె ఉంది. అలాగే చాపర్లకు గంటకు రూ. 4.50 లక్షల నుంచి రూ. 5. 50 లక్షల వరకు ఉంది. 2019 ఎన్నికల సమయంలో ఒక్కో హెలికాప్టర్ కు గంటకు అద్దె రూ. 55 వేలు నుంచి రూ. 1.30 లక్షల వరకు ఛార్జీ చేసేవారు. ఇప్పుడది త్రిబుల్ రేటు అయిపోయింది. హెలికాప్టర్ రకాన్ని బట్టి గంటకు రూ. 2 లక్షల నుంచి రూ. 3. 50 లక్షల వరకు పార్టీలు చెల్లిస్తున్నాయి. ఇవిచాలవన్నట్టు విమానశ్రయ ఛార్జీలు, ఎయిర్ పోర్ట్ హ్యాండ్లింగ్ ఛార్జీలు, ఫ్యూయల్ ట్రాన్స్ పోర్టేషన్, సిబ్బంది బస, ఆహారానికి అయ్యే ఖర్చు అదనం కావడం గమనార్హం. ప్రస్తుతం మన దేశంలో 350 చార్టర్డ్ విమానాలు, 175కు పైగా హెలికాప్టర్లు ఉన్నట్టు సమాచారం. ముంబయికి చెందిన ప్రైవేటు ఛార్టర్ కంపెనీ ఫ్లయింగ్ బర్డ్స్ ఏవియేషన్ కు నాలుగు హెలికాప్టర్లు, ఆరు జెట్ విమానాలున్నాయి. ఎన్నికల నేపథ్యంలో మరో కొన్ని హెలికాప్టర్లను అద్దెకు తీసుకుని అట్టిపెట్టుకుంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో సగటున 70-100 హెలికాప్టర్లకు డిమాండ్ ఉండేది. కానీ 40 మాత్రమే అప్పట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది హెలికాప్టర్ల డిమాండ్ 100-130కి పెరిగింది. అయితే కేవలం 50-60 విమానాలు మాత్రమే సమకూర్చగలుతున్నామని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. హెలికాప్టర్ల సంఖ్య తక్కువగా ఉండడం, డిమాండ్ ఎక్కువగా ఉండడంతో హెలికాప్టర్ల అద్దె ధరలు సైతం పెరిగాయి.

# బెల్లంపల్లి లో బిఆర్ఎస్ కి బిగ్ షాక్

### సీనియర్ కౌన్సిలర్ గెల్లిరాజ లింగుతో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్లు



**బెల్లంపల్లి, మే 4( ప్రభాత సమాచారం)**
బీఆర్ఎస్ పార్టీకి బెల్లంపల్లి పట్టణంలో గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్, కార్మిక సంఘాల నాయకుడు గెల్లిరాజ లింగు యాదవ్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ లోని బిఆర్ఎస్ 7 వ వార్డ్ కౌన్సిలర్ సముద్రాల లావణ్య , 12వ వార్డు కౌన్సిలర్ నెంది శ్రీలత రమేష్ , 27వ వార్డ్ కౌన్సిలర్ తడక పద్మావతి , 31వ వార్డ్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు , 30 వ వార్డ్ కౌన్సిలర్ సుకేశ్ ని భరద్వాజ్ , బెల్లంపల్లి పట్టణానికి చెందిన , బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, నూనె ప్రభాకర్ ,నెల్లి సమ్మయ్య, శనివారం బెల్లంపల్లి శాసనసభ్యులు గౌరవ శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి సమక్షంలో.. కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ప్రశ్నించే గొంతుకకు ఓటేద్దాం-పార్లమెంట్‌కు పంపిద్దాం

### రాహుల్ గాంధీ భారీ బహిరంగ విజయవంతం చేయండి
### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్






**దస్తురాబాద్ మే 4(ప్రభాత సమాచారం)**
ప్రశ్నించే గొంతుక కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు హస్తం గుర్తుకు ఓటేసి పార్లమెంట్ కు పంపించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం దస్తురాబాద్ మండలంలోని రేవుజిపేట గ్రామంలో మాజీ నీటి సంఘం చైర్మన్ లోక శరత్ రెడ్డి,బొమ్మన వజ్రావేలు, ముప్పిడి కిష్టయ్య, గడ్డం రాజన్న, ముడికె శ్రీనివాస్ , ముడిక ఐలయ్య, చంధ శేఖర్, జోగయ్య, సరోజన, సత్తయ్య రాములు, రాములు, నిజాముద్దీన్ లతో పాటు బిఆర్ఎస్, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పేదల పక్షాన పోరాడే ఆత్రం సుగుణ గెలుపు కోసం కార్యకర్తలంతా కలసి కట్టుగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన గ్యారెంటీలను ప్రతి గడపగడపకు తీసుకెళ్లాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకార్షితులై బిఆర్ఎస్, బీజేపీ, ప్రజా ప్రతినిధులు,నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈనెల 5న నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభకు కార్యకర్తలు, అభిమానులు,పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దస్తురాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డను భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

### రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయండి
### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పద్మశాలి సంఘం సభ్యులు




**జన్నారం మే 4(ప్రభాత సమాచారం )**
రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పేదల పక్షాన పోరాడే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం జన్నారం మండలంలోని ఓ పంక్షన్ హాలులో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో పద్మశాలి సంఘం సభ్యులు చేట్ పల్లి గంగయ్య, సారంగపాణి, వీరయ్య, రమేష్, శంకరయ్య, లచ్చన్న, సత్తన్న, రాజన్న,తిరుపతి, అంజన్న, భాస్కర్, తిరుపతి, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కార్యకర్తలంతా ఆత్రం సుగుణ గెలుపు కోసం కలిసికట్టుగా ఉండి రాత్రింబవళ్లు కష్టపడి పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో పేర్కొన్నారు. రేపు నిర్మల్ జిల్లా కేంద్రంలో జరగబోయే రాహుల్ గాంధీ సభకు కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున తరిలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**బెజ్జూర్ మే, 4: (ప్రభాత సమాచారం)**
వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కాగజ్ నగర్ మండలంలోని సీతానగర్ గ్రామములో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా షామియానా, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులకు టోకెన్లు అందించి క్రమపద్ధతిలో తూకం వేయాలన్నారు. గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలన్నారు. ధాన్యంలో తాలు, దుమ్ము లేకుండా చూడాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వృద్ధ రైతులను త్వరగా ఇంటికి పంపించాలన్నారు. తూకం జరిగిన వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో ముచ్చటించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం ఇంఛార్జి. వ్యవసాయ విస్తరణాధికారి, రైతులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ

### ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్




**ఖానాపూర్ మే 4(ప్రభాత సమాచారం )**
వందరోజుల ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.శనివారం బాధన్ కుర్తి గ్రామంలో ఆటోలో వెళుతున్న ఉపాధి హామీ కూలీలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వము కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఉపాధి హామీలకు 9 రకాల వస్తువులను అందజేయడం జరిగిందని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్నందున తగు జాగ్రత్తలు పాటిస్తూ... పనులను సకాలంలో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

### ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన కడం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు




**ఖానాపూర్ మే 4(ప్రభాత సమాచారం )**
పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కడెం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జొన్నల చంద్ర శేఖర్ గుప్తా పార్టీ కి రాజీనామా చేసి ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారితో పాటు బిఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షులు ఒడ్నాల సత్తన్న, మాజీ సర్పంచ్ భర్త లచ్చన్న ఉప సర్పంచ్ శ్రవణ్ బెడద, మల్లయ్య మేకల శేఖర్,గంగాధర్, తదితరులు కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సమిష్టిగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండ వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకార్షితులై బిఆర్ఎస్, బీజేపీ, ప్రజా ప్రతినిధులు,నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడం మండల, ఖానాపూర్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# భారత్‌లో 7 కోట్ల వాట్సాప్ ఖాతాలపై నిషేధం

న్యూఢిల్లీ : గతేడాది జనవరి-నవంబరు మధ్యకాలంలో భారత్‌లో దాదా పు 7 కోట్ల ఖాతాలను నిషేధించినట్టు ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన నెలవారీ నివేదికలో వెల్లడించింది. భారత్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనలు-2021లోని రూల్ 4(1)(డి)కు కట్టుబడి ఉంటామని మెటా యాజమాన్యంలోని వాట్సాప్ చెబుతోంది. ఈ క్రమంలో అవకతవక ఖాతాలపై తీవ్రంగా దర్యాప్తు చేస్తోంది. ఐటీ గైడ్‌లైన్స్‌కు అను గుణంగా నెలవారీ నివేదికలు వెల్లడిస్తోంది. వాట్సాప్ గ్రీవెన్స్ మెకా నిజం ద్వారా భారత్‌లోని వినియోగదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల ఆధారంగా.. భారత చట్టాలు, వాట్సాప్ నిబంధనలను ఉల్లంఘించిన ఖాతాలపై నిషేధం విధించినట్టు పేర్కొంది.

# ప్రచారం లో జోరు పెంచిన ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి



**బెల్లంపల్లి, మే 4( ప్రభాత సమాచారం)**
పార్లమెంట్ ఎన్నికల సమయం సమీస్తున్న వేళ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జోరు పెంచారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండి తన సోదరుడు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి తనయుడు గడ్డం వంశీ కృష్ణ పోటీ చేస్తుండడంతో నియోజక వర్గాన్ని చుట్టి వస్తున్నారు. ఒక వైపు ముమ్మరంగా ప్రచారం చేస్తూనే మరో వైపు భారీగా చేరికలతో ప్రత్యర్థులకు సవాలు విసురుతున్నారు. వంశి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎమ్మెల్యే ప్రచారంలో జోరు పెంచడంతో కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలు వేస్తుంది.

# మళ్ళీ మోడీనే ప్రధాని



**గుడిహత్నూర్ మే 4(ప్రభాత సమాచారం)**
పదేళ్లు సుస్థిర పాలనతో అన్ని వర్గాల హృదయాలను గెలుచుకున్న ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి కూడా ప్రధాని కాబోతున్నారని బిజెపి జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పేర్కొన్న. ఆయన శనివారం గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్, చిన్నా మన్నూర్, శంభూ గూడా, మామిడి గూడా, గ్రామాలలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పదేళ్లపాటు ఎన్డీఏ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు చోటు చేసుకోలేదన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం దేశ పరిరక్షణ కోసం పరితపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని మూడోసారి ప్రధానిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాపై పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉన్న సీనియర్ రాజకీయ నాయకుడు. బిజెపి ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు శివాజీ, జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, వైస్ ఎంపీపీ భరత్, సుభాష్, మండల బిజెపి నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**ఖానాపూర్ మే 4(ప్రభాత సమాచారం)**
బాధన్ కుర్తి గ్రామానికి చెందిన శంకర్ ఇటీవల చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద జారీపడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే




**ఖానాపూర్ మే 4(ప్రభాత సమాచారం )**
పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీ చెందిన ఉప్ప నవీన్ గత నెలలో బహ్రెయిన్ దేశం లో ఉపాధి కూలీగా పనికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గారు వారి ఇంటికి వెళ్లి నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయంగా అందజేశారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం గారు వైస్ చైర్మన్ కావలి సంతోష్ గారు, మండల అధ్యక్షులు దోనికేని దయానంద్, జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు తోట సత్యం,నేరేళ్ల సత్యనారాయణ గౌర్రె గంగాధర్, జహీర్ ఖాన్, మాదిరే సత్యనారయణ, శేషాద్రి, రాజేందర్, షౌకత్ పాషా,సతీష్ రెడ్డి, రమేష్ శ్రీనివాస్, తది తరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండ వర్గాలకు న్యాయం

## పలు కాలనిల్లో తిరుగుతూ...ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే









**ఖానాపూర్ మే 4(ప్రభాత సమాచారం )**
సబ్బండ వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం పట్టణంలో పొద్దుపొడుపు బొజ్జన్న అడుగు(మార్నింగ్ వాక్) కార్యక్ర మంలో భాగంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పలు కాలనీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదల సంక్షేమాన్ని కోరే కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కారం చేస్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ

## జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**బెజ్జూర్ మే 4, (ప్రభాత సమాచారం)**
ఎన్నికల నిర్వహణలో ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైనదని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కాగజ్నగర్ పట్టణములోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సిర్పూర్ నియోజక వర్గంలో పార్లమెంటు ఎన్నికల కొరకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, సిర్పూర్ సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు వున్నందున నోటాతో కలిపి 13 బటన్లు ఓటింగ్ యంత్రంలో పనిచేసేలా వుండాలన్నారు. మిగతా బటన్లకు సీలు వేయాలన్నారు. ఓటింగ్ యంత్రాలలో ప్రతి ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలన్నారు. ఎలాంటి తప్పులు జరుగకూడదన్నారు. ఎన్నికల నిర్వహణలో కమిషనింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైనదన్నారు. ప్రతి యంత్రం పనిచేసేలా చూడాలన్నారు. సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి మాట్లాడుతూ సిర్పూర్ నియోజక వర్గంలో 320 పోలింగ్ కేంద్రాలకు గాను కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించుటకు 40 టేబుళ్ళు ఏర్పాటు చేశామని కలెక్టరు వివరించారు. ప్రతి టేబుల్కు సెక్టార్ అధికారులు ఇంఛార్జిగా వుండి కమిషనింగ్ చేపడుతారని తెలిపారు. కమిషనింగ్ అనంతరం ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజస్వమండలాధికారి కాశబోయిన సురేష్, తహశీల్దారులు, సెక్టార్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భానుడి ప్రతాపం.. కార్మికుల బేజారు



గోదావరిఖని: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భానుడి ప్రతాపంతో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడుతోంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు డిగ్రీలు ఎక్కువగా ఉండే ఉపరితల గనుల్లో కార్మికులు పనిచేయాలంటే ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా రోజుకు 10 నుంచి 20 శాతం హాజరు తగ్గుతోంది. ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవంతో భారీ యంత్రాలు నడవక ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. గత మూడు రోజులుగా వరుసగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది కేవలం బయటి వరకే. ఉపరితల గనుల క్వారీల్లో దీనికి మరో మూడు డిగ్రీలు ఎక్కువగానే ఉంటుంది. చుట్టూ బొగ్గు పొరలతో పాటు ఉత్పత్తి చేసిన బొగ్గు మండుతుండటంతో సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా వేడి నమోదవుతోంది. దీంతో క్వారీల్లో సిబ్బంది పనిచేయలేకపోతున్నారు. క్వారీల్లో ఎలాంటి రక్షణ లేకుండా కేబుల్‌బాయ్‌లు, ఎలక్ట్రీషియన్లు, మజ్దూర్ కార్మికులు పనిచేయాల్సి ఉంటుంది. వీరితో పాటు డంపర్, షావల్, డోజర్ ఆపరేటర్లు పూర్తిగా ఎండలోనే విధులు నిర్వహించాలి. డంపర్, షావల్ క్యాబిన్‌లో ఏసీ సౌకర్యం ఉన్నప్పటికీ బయట ఉన్న ఉష్ణోగ్రతలు ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఉపరితల గనుల్లో పనిచేసే ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. రాత్రి షిప్టు ఉన్న ఉద్యోగులు మాత్రమే పూర్తిస్థాయిలో హాజరవుతున్నారు.

**వేడిగాలులు కారణం..**

వేడి గాలుల కారణంగా ఉదయం, రెండో షిప్టులో పనిచేసే ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విధులు నిర్వహించే ఉదయం షిప్టు ఉద్యోగులు ఉదయం నుంచే మొదలవుతున్న ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారు. వేడి గాలులతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని భావిస్తున్నారు. ఇక రెండో షిప్టు విధులు నిర్వహించే ఉద్యోగులు ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. మిట్టమధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండటంతో విధులు నిర్వహించే ప్రాంతానికి చేరుకోవడమే కష్టంగా భావిస్తున్నారు.

**30 శాతానికి తగ్గిన ఉత్పత్తి**

ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి 30 శాతం తగ్గింది. సింగరేణి వ్యాప్తంగా 80 శాతం బొగ్గును ఉపరితల గనుల ద్వారా వెలికి తీస్తే మిగతా 20 శాతం భూగర్భ గనుల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. ఉపరితల గనుల్లో రోజుకు 2 లక్షల టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి చేపడతారు. ప్రస్తుతం రోజుకు 1.4 లక్షల టన్నుల నుంచి 1.5 లక్షల టన్నుల వరకు మాత్రమే బొగ్గు ఉత్పత్తి చేపడుతున్నారు. భూగర్భ బొగ్గుగనుల్లో మాత్రం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తి సాగుతోంది. భూగర్భ బొగ్గుగనుల్లో పనిచేసే కార్మికులకు ఎండ తీవ్రతతో సంబంధం లేకపోవడంతో హాజరు శాతం ఎప్పటిలాగే ఉంటోంది.

**పని వేళల్లో కనిపించని మార్పు**

ఎండ తీవ్రత నేపథ్యంలో ఉపరితల గనుల్లో పని వేళలు మార్పు చేయాలని ఉద్యోగులు కోరుతున్నా యాజమాన్యం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండో షిప్టు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పని వేళలను మార్పు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఓట్లు భద్రం.. తీర్పు సుస్పష్టం..!

దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఈవీఎంలలో ఓటు భద్రమేనా అనే అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఇప్పటికే ముగిసిన మొదటి, రెండో విడత పోలింగ్ శాతాల వెల్లడిలో జాప్యంపై వివిధ పార్టీలు ఈసీఐ విధానాన్ని ప్రశ్నించాయి. తొలి విడత (ఏప్రిల్ 19), రెండో విడత (ఏప్రిల్ 26) పోలింగ్ శాతం వివరాలను ఎన్నికల సంఘం అధికారికంగా మంగళవారం ప్రకటించింది. తొలి విడత పోలింగ్ ముగిసిన పదకొండు రోజుల తర్వాత తుది వివరాలు వెల్లడించటంపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇది అధికార భాజపాకు మేలు చేసేందుకేనని పరోక్షంగా విమర్శిస్తున్నాయి. ఎన్నికల అధికారులు మాత్రం ఈవీఎంలలో పొరపాట్లు జరగటానికి ఆస్కారమే లేదంటున్నారు. పోలింగ్ శాతం వెల్లడిలో ఆలస్యమైనంత మాత్రాన పోలైన ఓట్లపై ప్రభావం ఉండబోదని చెబుతున్నారు.

ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు ప్రతి ఓటూ కీలకం. సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)లపై పలుమార్లు రాజకీయ పార్టీలు సందేహాలు వ్యక్తం చేశాయి. వాటి పనితీరుపై తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. ఈవీఎంలు పారదర్శకంగా పనిచేస్తాయని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. ఓటేసేందుకు వినియోగించే ఈవీఎంలను అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు సమక్షంలో వివిధ దఫాల్లో పరిశీలిస్తామంటున్నారు. పోలింగ్ ముగిశాక కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తామని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పటిష్ఠ బందోబస్తు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రత సిబ్బంది కనుసన్నల్లో స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్నప్పుడు అవకతవకలకు ఆస్కారం లేదని చెబుతున్నారు.

**పారదర్శకంగా వీవీప్యాట్ చీటీల లెక్కింపు**

ఈవీఎంలపై అపోహలు తొలగించేందుకు కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు, వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చే విధానాన్ని ఈసీ అనుసరిస్తోంది. లోక్‌సభ స్థానం పరిధిలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలోని ఏదైనా ఒక కంట్రోల్ యూనిట్‌ను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు. వీటిని లెక్కించటానికి ప్రత్యేక టేబుల్ సమకూర్చుతారు. లెక్కింపు ప్రక్రియ సంబంధిత ఆర్ఓ లేదా ఏఆర్ఓ పర్యవేక్షణలో జరుగుతుంది. సీయూలోని ఓట్లు, వీవీప్యాట్ స్లిప్‌ల మధ్య వ్యత్యాసం ఉంటే వీవీప్యాట్లను ఒకటికి రెండుసార్లు లెక్కిస్తారు. చివరికి వీవీప్యాట్ స్లిప్‌లనే ప్రామాణికంగా తీసుకుని తుది ఫలితాలను ఆర్ఓ వెల్లడిస్తారు. ఒకదాని తర్వాత మరొక వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తారు.

**వ్యత్యాసం ఉండదు**

పోలింగ్ ముగిశాక ప్రిసైడింగ్ అధికారి చట్టబద్ధమైన ఫాం-17(సీ)లో పోలైన ఓట్ల వివరాలను నమోదుచేస్తారు. ఫాం-17(సీ) రెండు భాగాలను కలిగి ఉంటుంది. మొత్తం పోలైన ఓట్లను లెక్కించి ఫాం-17(సీ)లోని మొదటి పార్టులో పొందుపరుస్తారు. రెండో పార్టును ఓట్ల లెక్కింపు రోజు వినియోగిస్తారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ ఏజెంట్ సదరు పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలతో కూడిన ఫాం-17(సీ) ఒరిజినల్ కాపీ పొందవచ్చు. ఇది ఓట్ల లెక్కింపు రోజు అభ్యర్థికి ఉపయోగపడుతుంది. అంతకుముందు ఫాం-17ఏ (ఓటర్ల రిజిస్టర్)లో నమోదైన ఓట్లు, ఫాం-17(సీ)లో ప్రస్తావించిన వివరాలు సరిపోలితేనే ఏజెంట్లు పీఓ ఇచ్చే ధ్రువపత్రంపై సంతకం చేయాల్సి ఉంటుంది. పోలింగ్ ముగిశాక ఈవీఎంలకు ఫాం-17(ఏ), 17(సీ) కాపీలు జతపరిచి సీల్ వేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తామని అధికారులు చెబుతున్నారు. తద్వారా పోలైన ఓట్లకు ఈవీఎంలోని ఓట్లకు వ్యత్యాసం వచ్చే అవకాశం లేదంటున్నారు. టెండర్ ఓట్లను ఫాం-17(బీ)లో నమోదుచేస్తారు.

**ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్**

పోలింగ్ ప్రారంభానికి ముందు పోలింగ్ కేంద్రంలో ఉపయోగిస్తున్న బ్యాలెట్ బాక్స్ ఖాళీగా ఉందని ప్రిసైడింగ్ అధికారి అక్కడి ఏజెంట్లకు చూపిస్తారు. ఈవీఎంలలో అంతకుముందు ఓట్లు దాగిలేవని ఏజెంట్లను పీఓ సంతృప్తిపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం సంబంధిత పోలింగ్ కేంద్రానికి కేటాయించిన సీయూ(కంట్రోల్ యూనిట్)లో రిజల్ట్ బటన్ నొక్కటం ద్వారా అందులో ఇదివరకే నమోదైన ఓట్లు ఏమీ లేవని ధ్రువీకరిస్తూ ఏజెంట్ల ముందు ప్రదర్శిస్తారు. ఆతర్వాతే ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు.

# ఎండ పెరిగి.. మీటర్లు తిరిగి

మెదక్ : ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్తు వినియోగం పెరిగి గృహజ్యోతి కింద జీరో బిల్లులు పొందే లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయింది. ప్రభుత్వ నిబంధనల మేరకు 200 యూనిట్లలోపు వినియోగించుకునే వారికి జీరో బిల్లు ఇస్తారు. ఎండల కారణంగా ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లతో పాటు విద్యుత్తు పరికరాల వాడకం పెరిగిపోవడంతో చాలామంది పరిమిత యూనిట్లు దాటిపోయి, రాయితీని పొందలేకపోతున్నారు. గత నెలతో పోలిస్తే గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య తగ్గినా.. రాయితీ డబ్బు పెరగడం విశేషం. గతంలో 100 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగించుకున్న లబ్ధిదారులు సైతం ఎక్కువ విద్యుత్తును వాడుతున్నారు. కానీ వినియోగం 200 యూనిట్లలోపు ఉండడంతో వారికి ఇచ్చే రాయితీ సొమ్ము పెరిగింది. అధికారుల లెక్కల మేరకు లబ్ధిదారుల సంఖ్య తగ్గినా... వినియోగం పెరగడంతో ప్రభుత్వానికి రాయితీ భారం పెరుగుతోంది.

**తగ్గిన సర్వీసులు:** జిల్లా వ్యాప్తంగా 2,04,945 విద్యుత్తు కనెక్షన్లు ఉండగా, తెల్లరేషన్ కార్డు ఉండి గృహజ్యోతి పథకం కింద లబ్ధిపొందే వారు 1,14,027 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మార్చి నెలలో 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించుకున్న 1,11,258 సర్వీసులకు జీరో బిల్లులు ఇచ్చారు. తాజాగా ఎండలు ఎక్కువ కావడంతో విద్యుత్తు వినియోగం పెరిగింది. గత నెలలో జీరో బిల్లులు పొందిన వారిలో కొంతమంది 200 యూనిట్లు దాటడంతో ఈ నెలలో బిల్లును చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెలలో 1,09,649 సర్వీసులకు మాత్రమే జీరో బిల్లు వచ్చాయి. ఎండల తీవ్రత కారణంగా విద్యుత్తును ఎక్కువగా వాడటంతో 1601 మంది అర్హతను కోల్పోయారు. మార్చి నెలలో రూ. 2.66 కోట్లు రాయితీ ఇవ్వగా, ఈ నెలలో రూ. 3.26 కోట్లుగా ఉంది. ఒక నెలలోనే రాయితీ సొమ్ము రూ. 60 లక్షలకు పెరిగింది.

**కోడ్ ముగిశాకే సవరణ:** ఎన్నికల కోడ్ రాకముందే ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించింది. ప్రజాపాలనలో దరఖాస్తులు తప్పుగా ఇవ్వడంతో పాటు కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన తప్పిదాల వల్ల చాలా మంది జీరో బిల్లులను పొందలేక పోయారు. తర్వాత మార్చుకునేందుకు అవకాశం ఇచ్చినా.. అది పూర్తికాకముందే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ కోసం జిల్లాలో ఇంకా చాలా మంది ఎదురుచూస్తున్నారు. కోడ్ ముగిసిన తర్వాత జూన్ నెల నుంచి మిగతా వారు జీరో బిల్లు పొందే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు. జిల్లాలో 200 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగిస్తున్న కొంతమందికి ఆహార భద్రత కార్డులు లేకపోవడంతో గృహజ్యోతి పథకం కింద లబ్ధిపొందలేక పోతున్నారు.

# పద్మశ్రీ మొగిలయ్యకు పెన్షన్ అందుతోంది !



హైదరాబాద్ : డబ్బులు లేక కూలి పనులకు వెళ్తున్నట్లుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కళాకారుడు మొగిలయ్య చెప్పడం ఆయన కూలి పనులు చేస్తున్న వీడియోలు బయటకు రావడంతో అదంతా తెగ వైరల్ అయింది. మొగిలయ్య అంటే తెలంగాణాలో అద్భుతమైన కళాకారుడు. గిరిజన సంగీత పరికరాలతో వాయిద్యం అందించడంలో దిట్ట. అటువంటి ఆయన తన కుటుంబ పోషణతో పాటు తనకు కుమారుడికి ఉన్న అనారోగ్య సమస్యల వల్ల మందుల కోసం ఇలా కూలి పనులు చేయాల్సి వస్తోందని చెప్పి ఆశ్చర్యపరచారు. దాంతో కవులు కళాకారులకు ఇదేనా చివరికి జరిగేది అన్న చర్చ మొదలైంది. పద్మశ్రీ అవార్డు అందుకోవడం అంటే సామాన్య విషయం కాదు. దేశంలో అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న మొగిలయ్య గొప్ప కళాకారుడు అయి ఉండి చివరికి ఇలా తన జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నారా అని అంతా ఆవేదనకు గురి అయ్యారు. అయితే దీని మీద తెలంగాణా ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. దాని ప్రకారం చూస్తే క్రమం తప్పకుండా మొగిలయ్యకు పెన్షన్ ప్రతీ నెలా చెల్లిస్తున్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి సీపీఆర్వో అయోధ్యరెడ్డి తెలిపారు. అంతే కాదు మార్చి 31న కూడా ఆయన ఖాతాలోకి 20 వేల రూపాయల పెన్షన్ జమ చేసినట్లుగా వెల్లడించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ కూడా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కవులు కళాకారులను ఎపుడూ గౌరవిస్తుందని కూడా పేర్కొన్నారు. అయితే ఏప్రిల్ నెల లో పెన్షన్ కొంచెం ఆలస్యం అవుతుందని మొగిలయ్యకు ముందే ఫోన్ చేసి చెప్పినట్లుగా కూడా అధికారులు చెప్పడం విశేషం. మొత్తం మీద ఇరవై వేల రూపాయలు పెన్షన్ ప్రతీ నెలా మొగిలయ్యకు ప్రభుత్వం నుంచి రావడం మంచి విషయంగానే చూడాలి. మరి ఆయన కూలి పనులకు వెళ్తున్నారు. ఎందుకు అంటే ఆర్థిక ఇబ్బందులు అని చెబుతున్నారు. పెన్షన్ ఆలస్యం అయింది దాంతోనే ఆయన ఇబ్బంది పడి ఇలా కూలి పనులకు వెళున్నారా లేక ఆయనకు ఈ సొమ్ము కూడా సరిపోవడం లేదా అన్న చర్చ సాగుతోంది. ఏది ఏమైనా తెలంగాణా ప్రభుత్వం కళాకారులను గౌరవించడం అన్నది స్వాగతించ తగినదే.

# ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు బిగ్ షాక్... ఆ కీలక నేతతో పాటు మరికొందరు నేతల రాజీనామా



ఢిల్లీ: ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీకి మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ రాజీనామా చేశారు. రాజీనామాను పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపించారు. రాపోలు ఆనంద భాస్కర్‌తో పాటు మెదక్ జిల్లా సీనియర్ నేత మహమ్మద్ మొహినుద్దీన్, వరంగల్ జిల్లా నేత, రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు తీగల లక్ష్మణ్ గౌడ్‌లు బీఆర్ఎస్ పార్టీని వీడారు. ఈ సందర్భంగా రాపోలు ఆనంద భాస్కర్ మాట్లాడుతూ.. విధిలేని పరిస్థితిలో కీలక నిర్ణయం తీసుకున్నానన్నారు. కేసీఆర్ ఏ నిర్ణయాలు తీసుకుంటారో అర్థం కాని పరిస్థితిలో తన లాంటి నేతలు ఉన్నారన్నారు. 2022లో కేసీఆర్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్‌లో చేరానన్నారు. ప్రాంతీయ ఉద్యమ పార్టీ నుంచి ఇక తన అనుబంధాన్ని తుంచుకుంటున్నానని రాపోలు ఆనంద భాస్కర్ తెలిపారు. తాను బీఆర్ఎస్ లో చేరినప్పుడు కేసీఆర్ ఇచ్చిన బీఆర్ఎస్ కండువాను హైదరాబాద్ తెలంగాణ భవన్‌కి స్పీడ్ పోస్ట్ ద్వారా పంపినట్టు తెలిపారు. తెలంగాణ సబ్బండ వర్గాల కోసం పోరాడేలా తన భవిష్యత్తు కార్యచరణ ఉంటుందన్నారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. తెలంగాణ భౌగోళిక స్వరూపం ప్రగతి పరిరక్షణ కోసం ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తానన్నారు. కుల జన గణన అంశం ఉద్యమాల్లో తన పాత్ర ఉంటుందన్నారు. కేసీఆర్ గణాంకాల కోసం సకల జనుల సర్వే మాత్రమే చేశారని రాపోలు అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రియాశీలకంగా పనిచేస్తోందన్నారు. కుల జన గణన దిశగా అడుగులు వేస్తోందన్నారు. తాను ఉద్యమాల వెంట ఉండే వ్యక్తినని రాపోలు పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కొందరికి కంటగింపుగా ఉందన్నారు. తెలంగాణ హైదరాబాద్ అభివృద్ధిని ఓర్చుకోలేక పోతున్నారన్నారు. తాను ఎవరిపైనా విమర్శలు చేయబోనని తనకున్న సమాచారం మేరకు ప్రజలను జాగృతం చేస్తున్నానన్నారు. హైదరాబాద్ అంశాన్ని రేవంత్ రెడ్డి, కేసీఆర్ అందరి దృష్టికి తీసుకువెళతాన్నారు. ఏ పార్టీలోకి వెళతా అనేది చెప్పలేనని.. ప్రజా ఉద్యమాల్లో ఉంటానని రాపోలు ఆనంద భాస్కర్ తెలిపారు.

# స్నానాలగదిలో ప్రసవం.. కవర్‌లో శిశువును చుట్టి రోడ్డుపైకి విసిరేసిన విద్యార్థిని

తిరువనంతపురం: కేరళలోని కొచ్చిన్‌లో ఓ యువతి తాను జన్మనిచ్చిన శిశువును రోడ్డుపైకి విసిరేసింది. 24 ఏళ్ల ఎంబీఏ విద్యార్థిని అపార్ట్‌మెంట్ బాత్రూమ్‌లో శుక్రవారం ఉదయం శిశువుకు జన్మనిచ్చింది. ఆ విషయం ఆమె తల్లిదండ్రులకు తెలియకూడదని అమెజాన్ పార్సిల్ కవర్‌లో శిశువును చుట్టి అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి బయటకు విసిరేసింది. ఈ క్రమంలో రోడ్డుపై పడిన శిశువు ప్రాణాలు కోల్పోయింది. కాగా, కొందరు కార్మికులు పార్సిల్ కవర్‌లో ఉన్న శిశువు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పార్శిల్ కవర్‌పై ఉన్న అడ్రస్‌ను బట్టి పోలీసులు నిందితురాలిని గుర్తించారు. ఈ ఘటనపై ఆమెను విచారిస్తున్నారు.



# 25నుంచి భారత్‌గౌరవ్ రైలు 'దివ్య దక్షిణ యాత్ర'

హైదరాబాద్: పర్యాటకులు, భక్తుల కోసం ప్రత్యేకించి మే 25 నుంచి 9 రోజుల పాటు భారత్ గౌరవ్ రైలు 'దివ్య దక్షిణ యాత్ర'కు బయలుదేరుతుందని ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ప్రత్యేక రైలు యాత్రలో భాగంగా పర్యాటకులు, భక్తులు తిరువణ్ణామలై (అరుణాచలం), రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు క్షేత్రాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పర్యాటకులు సికింద్రాబాద్ స్టేషన్‌తో పాటు కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్‌లలో దివ్యదక్షిణ యాత్ర రైలులో ఎక్కడానికి, దిగడానికి అవకాశం ఉంటుందన్నారు. రైలులోనే ఉదయం అల్పాహారం, కాఫీ లేదా టీ, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందించనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 2న తిరిగి వచ్చే ఈ రైలులో ఒకొక్కరికీ సెకండ్ క్లాస్ ఏసీలో రూ.28,450, థర్డ్ క్లాస్ ఏసీ రూ.21,900లు, స్లీపర్‌లో రూ.14,250లుగా చార్జీ ఖరారు చేసినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ఐఆర్‌సీటీసీ (సౌత్ సెంట్రల్‌జోన్) సికింద్రాబాద్ మొబైల్ నంబర్ 92814 95845, 92814 95843, 97013 60647లలో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



# ఎంఐఎం ఎన్నికల ప్రచారంలో ఆసక్తికర దృశ్యం.. పూజారి ఆశీర్వాదం తీసుకున్న అసదుద్దీన్..

హైదరాబాద్: లోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అభ్యర్థులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంటు ఎంపీ అభ్యర్థి ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ కూడా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

ప్రచారంలో భాగంగా ఆయన మే 4న మూసారాంబాగ్‌లో కలియతిరిగారు. స్థానికులతో మాట్లాడుతూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతుండగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. ఆయన తన పర్యటనలో భాగంగా ఆంజనేయ స్వామి గుడి పక్క నుంచి వెళ్తున్నారు. అప్పటికే గుమిగూడిన ఎంఎంఐ కార్యకర్తలు అసద్‌ని ఆశీర్వదించాలని ఆంజనేయ స్వామి ఆలయ పూజారిని కోరారు. అసద్ కూడా అర్చకుడి ఆశీర్వాదం కోసం ముందుకు వచ్చారు. అనంతరం పూజారి.. అసద్ మెడలో పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించి ఆశీర్వదించారు. అనంతరం అసద్ అర్చకులందరితో కలిసి ఫొటో దిగారు. సదరు వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అసద్ ఎన్నికల ప్రచారానికి వెళ్లి.. మత సామరస్యాన్ని చాటారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రోహిత్ వేముల తల్లి..



హైదరాబాద్: ఆత్మహత్య చేసుకున్న హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధిక సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ కేసులో తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు. కేసు పునర్విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తామని ఆమెకు సీఎం హామీ ఇచ్చారు. రోహిత్ వేముల ఆత్మహత్య కేసులో శుక్రవారం ముఖ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై దర్యాప్తు ముగిసిన దశలో కీలక మలుపు తిరిగింది. దర్యాప్తును కొనసాగించాలని పోలీసుశాఖ నిర్ణయించింది. ఈ వ్యవహారంలో వర్సిటీ వీసీతోపాటు పలువురు నేతలపై దాఖలైన కేసులో ఆధారాల్లేవంటూ తాజాగా హైకోర్టుకు పోలీసులు నివేదిక సమర్పించారు. ఆ నివేదికపై రోహిత్ తల్లి అనుమానాలు వ్యక్తం చేయడం, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో పోలీసుశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. వేముల రోహిత్ 2016లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు, హెచ్‌సీయూ విద్యార్థులు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. దేశవ్యాప్తంగా అనేక రాజకీయపార్టీలు స్పందించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రెండుసార్లు హైదరాబాద్‌కు వచ్చి వెళ్లారు. ఆత్మహత్యపై అప్పట్లో సైబరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

# అబద్ధాల కాంగ్రెస్‌ను శిక్షించాల్సిందే: హరీశ్‌రావు

హైదరాబాద్: ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆరింటిలో ఐదు హామీలు అమలు చేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారని, అందంతా అబద్ధమని అన్నారు. బషీర్‌బాగ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బాండ్ పేపర్ బౌన్స్ అయ్యిందన్న ఆయన.. ఆ పార్టీని ఈ ఎన్నికల్లో శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీస్తున్నాయని విమర్శించారు. ఆయన మాటల్లో పగ, ప్రతీకారమే కనిపిస్తోందని వ్యాఖ్యానించారు."భారాస హయాంలో పంటకు పెట్టుబడి సహాయాన్ని సకాలంలో అందించాం. కానీ, ఇప్పుడు పంట చేతికొచ్చినా, పెట్టుబడి సాయం మాత్రం రైతులకు అందడం లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాదాపు 80 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేవి. కానీ, ప్రస్తుత ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకే మొగ్గు చూపుతున్నారు. గతంలో నీటి కొరత, కరెంట్ కోత అనే పదాలే వినిపించేవి కాదు. నీటి కష్టాలు, కరెంట్ కోతలు అప్పుడే మొదలయ్యాయి" అని హరీశ్ విమర్శించారు.



# వారి కోసమే గవర్నర్ పదవిని వదిలేశా..



సంగారెడ్డి, మే 4: కేవలం కుటుంబ సభ్యుల బాగు కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని.. దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజలను కుటుంబ సభ్యులుగా చూసుకునేది బీజేపీ మాత్రమే అని మాజీ గవర్నర్ తమిళ సై సౌందర్ రాజన్ అన్నారు. శనివారం సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేధావుల సదస్సుకు తమిళ సై హాజరై ప్రసంగించారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశానికి చేసింది ఏమీ లేదన్నారు. అస్సలు ఆయనకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని అన్నారు. 70 సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అభివృద్ధి కేవలం మోదీతోనే సాధ్యమని.. అందుకే దేశ ప్రజలు మోదీని కోరుకుంటున్నారని చెప్పారు.

ఎన్నికల్లో పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే అని... బీఆర్ఎస్‌తో అస్సలు కాదన్నారు. ఏ పార్టీకి ఓటు వేసిన గెలిచేది మాత్రం మోదీనే అని తమిళ సై ధీమా వ్యక్తం చేశారు.

**గవర్నర్ పదవిపై ఇలా..** "చాలా మంది మీరు గవర్నర్ పదవికి ఎందుకు వదిలేశారు అడిగిన వారికి ఒక్కటే చెపుతున్న ... ప్రజలతో ఉండటానికి ప్రజల కోసం పని చేయడానికి, ప్రత్యక్షంగా ప్రజలతో ఉండాలని అంతేకాక తెలంగాణ ప్రజలు అందరి నన్ను సోదరిగా స్వీకరించారు. ఆ ప్రేమ కోసం గవర్నర్ పదవిని కూడా వదిలేశా" అని తమిళ సై సౌందర్ రాజన్ వివరించారు.

# హాస్యాస్పదంగా ఆరు గ్యారెంటీల అమలు : తలసాని

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో ఐదు హామీలను అమలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం అమీర్‌పేట డివిజన్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా సుప్రభాత్ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, అనంతరం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. బీజేఆర్ నగర్, రేణుకనగర్, బల్కంపేట, బీజేఆర్ నగర్–2లలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా తలసాని, పద్మారావుగౌడ్‌కు మంగళహారతులతో మహిళలు ఘన స్వాగతం పలికి శాలువలు కప్పి సన్మానించారు. పేద, మధ్య తరగతి ప్రజల పక్షాన నిలిచే బీఆర్ఎస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు అని, కారు గుర్తుకు ఓటువేసి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని, పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఏం చేశామో వివరిస్తూ ఓట్లు అడిగే ధైర్యం తమకు ఉందని, ఈ విషయంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులకు ఉందా అని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, బాల్‌రెడ్డి, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, లలితా గోపిలాల్ చౌహాన్, క్రిష్ణ కిరణ్ గౌడ్(కిట్టు) పాల్గొన్నారు.

# మంగళసూత్రం విలువ మోదీకేం తెలుసు..? : దానం నాగేందర్

హైదరాబాద్: ఆడవారు పవిత్రంగా భావించే మంగళసూత్రం విలువ ప్రధాని మోదీకి ఏమి తెలుస్తుందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ఎద్దేవా వేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలు మంగళసూత్రాలు అమ్ముకోవాలని ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. శనివారం బంజారాహిల్స్‌లోని లేక్ వ్యూ బంజారాలో నిర్వహించిన ఖైరతాబాద్ డివిజన్ కార్యకర్తల సమ్మేళనా నికి దానం నాగేందర్‌తో పాటు కార్పొరేటర్ పి.విజయారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. అబ్‌కి బార్ 400 అని ప్రధాని మోదీ పిలుపునిస్తున్నారని, ఇలా సీట్లు వస్తే చైనా, రష్యా ప్రధానుల మాదిరి రాబోయే 20సంవత్సరాలు తానే ప్రధాన మంత్రిగా ఉండాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. కానీ ప్రజలు ఈ విష యం పసిగట్టి బీజేపీకి కాకుండా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపిస్తున్నారన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి బడుగు బలహీన వర్గాలకు చేయూతనందించేందుకు రిజర్వేషన్‌లు ఏర్పాటు చేస్తే వాటిని ఎత్తేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న వ్యక్తి సికింద్రాబాద్ పార్లమెంట్‌కు ఏం చేయలేదని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇలాంటి వారికి బుద్ధి చెప్పేందుకే సీఎం రేవంత్‌రెడ్డి తన లాంటి ప్రజా నాయకుడికి టికెట్ ఇచ్చారని దానం పేర్కొన్నారు. అన్ని వర్గాల సమస్యలు తెలిసిన తనకు ఓటు వేసి గెలిస్తే అభివృద్ధికి పునాదులు వేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ పి.విజయారెడ్డి మాట్లాడుతూ ఖైరతాబాద్ అంటే కాంగ్రెస్ కంచుకోట అని రాబోయే ఎన్నికల్లో అందరూ ఐక్యమత్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నారికెళ్ల నరేష్, దన్‌రాజ్‌రాథోడ్, వంశీ పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660